క్లుప్తంగా

నేడు మండలసర్వ సభ్యసమావేశం

జామి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిం చనున్నట్లు ఎంపీడీఓ ఎస్. అప్పల నాయుడు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ సబ్బవరపు అరుణ అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు,సర్పంచ్‌లు, మండల అధికారులు హాజరుకావాలని కోరారు.

గ్రంథాలయం ప్రారంభం



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న హెచ్‌ఎం సంగం నాయుడు

గుర్ల: మండలంలోని పాలాయవలసలో గ్రామానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినీ గ్రంథాలయాన్ని తెట్టంగి హైస్కూల్ హెచ్‌ఎం రౌతు సంగంనాయుడు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత, విద్యార్థులు ముందుకు వచ్చి గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం శుభ పరిణామమన్నారు. గ్రంథాలయానికి అవసరమైన పుస్తకాలను అందిస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

వినాయకుడి లడ్డూ రూ. 52,116



వేలంపాటలో పాల్గొన్న భక్తులు

చీపురుపల్లి: పట్టణంలోని లావేరురోడ్‌లో వరసిద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా లడ్డూ వేలంపాట శుక్రవారం నిర్వహించారు. పట్టణానికి చెందిన సూరి ఉమాశంకర్ 51 కిలోల తాపేశ్వరం లడ్డూను 52,116 రూపాయలకు పాటలో దక్కించుకున్నారు. దీంతో కమిటీ సభ్యులు మేళతాళాల నడుమ లడ్డూను ఊరేగిస్తూ ఆయన ఇంటికి తీసుకెళ్లి అప్పగించారు.

శరన్నవరాత్రులకు అంకురార్పణ




పూజలు చేస్తున్న సత్యనారాయణమూర్తి దంపతుల

శృంగవరపుకోట: మండలంలోని మేజర్‌పంచాయతీ ధర్మవరం గ్రామంలో దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలకు రంగం సిద్ధమవుతోంది. స్థానికుడు కె.వి.సత్యనారాయణమూర్తి కుటుంబీకులు ఈ ఏడాది తొలిసారిగా గ్రామంలో శరన్నవరాత్రి ఉత్సవాలు జరిపించేందుకు ముందుకు వచ్చారు. ఈ నేపథ్యంలో సత్యనారాయణమూర్తి దంపతులతో వేదపండితుల శుక్రవారం రాట వేయించి, మొక్క నాటించారు. ఉత్సవాల్లో తొమ్మిదిరోజుల పాటు అమ్మవారికి విశేషపూజలు, అలంకారాలు, కుంకుమ పూజలు నిర్వహిస్తామని, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని నిర్వాహకులు చెప్పారు.

బెల్టు షాపుపై దాడి

దత్తిరాజేరు: మండలంలోని గడసాం గ్రామంలో ఓ వ్యక్తి నిర్వహిస్తున్న బెల్టు షాపుపై శుక్రవారం దాడి చేశామని ఎక్సైజ్ సీఐ జనార్దనరావు తెలిపారు. నిందితుడి నుంచి పది మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని చెప్పారు. బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సర్కిల్ పరిధిలో ఇప్పటి వరకు 139 బెల్ట్ షాపులపై దాడులు చేసి కేసులు నమోదు చేశామని వివరించారు.

భవన నిర్మాణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఏపీసీ రామారావు

దత్తిరాజేరు: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో డార్మెటరీ కోసం నిర్మిస్తున్న భవనాల పనులను సర్వశిక్ష అభియాన్ ఏపీసీ రామారావు శుక్రవారం పరిశీలించారు. భవన నిర్మాణాలకు రూ.2.12 కోట్లు మంజూరయ్యాయని, నిర్మాణాలు త్వరితగతిని పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

ఘనంగా గురుపూజోత్సవం



దత్తిరాజేరు: కేజీబీవీలో నిర్వహించిన వేడుకల్లో ఉపాధ్యాయినులు, విద్యార్థినులు



గజపతినగరం రూరల్: రక్తదానం చేస్తున్న సాయి సిద్ధార్థ కళాశాలల కరస్పాండెంట్ చంద్రశేఖర్

శృంగవరపుకోట:

ఉపాధ్యాయ శిరోమణి, భారతదేశ రెండో రాష్ట్రపతిగా పనిచేసిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని పట్టణంలో బాపూజీ సేవా సంఘం నేతృత్వంలో శుక్రవా రం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సంఘ సభ్యులు సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు ఎం.ఈశ్వర వెంకటరావును శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి వసంత శ్రీనివాసరావు, వి.భాస్కరశర్మ, మోపాడ చిన్నికృష్ణ, సనివాడ గోవిందరావు, బొండా రామారావు, బర్ల స్వామినాయుడు, పాసిం రమణ, పిరిడి సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

షటిల్ కోచ్‌కు సన్మానం

ఎస్.కోట పట్టణంలోని ఫ్రెండ్స్ రిక్రియేషన్ క్లబ్ ఆవరణలోని ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు, కోచ్‌లు ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. గత రెండు దశాబ్దాలుగా పలువురు విద్యార్థులను షటిల్ బ్యాడ్మింటన్‌లో జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దిన కోచ్ పి.శ్రీరాములును కోచ్‌లు, క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు సన్మానించారు.

మెగా రక్తదాన శిబిరం

గజపతినగరం రూరల్: ఉపాధ్యాయ దినోత్సవవ సందర్భంగా స్థానిక సాయిసిద్ధార్థ జూనియర్, డిగ్రీ కళాశాలలో ఆ కళాశాల కరెస్పాండెంట్ ఎస్.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. 81 మంది యువకులతో పాటు చంద్రశేఖర్ రక్తదానం చేశారు. వీరి నుంచి సేకరించిన రక్తాన్ని విజయనగరం మహారాజా ఆస్పత్రి వైద్యసిబ్బందికి అందజేశారు. అనంతరం అధ్యాపకులను సన్మానించారు. ఈసందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. స్థాని క ఏరియా ఆస్పత్రి వైద్యురాలు మైత్రేయి, ప్రిన్సిపాల్ కె.వెంకటరమణ,తదితరులు పాల్గొన్నారు

దత్తిరాజేరు కేజీబీవీలో...

దత్తిరాజేరు: ఎవరు ఏ వృత్తిలో ఉన్నా వారికి గురువే దైవమని స్థానిక కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ) ఆంగ్ల ఉపాధ్యాయిని కె.కల్యాణి అన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు.సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ఉపాధ్యాయినులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



శృంగవరపుకోట: ఎస్.కోట పట్టణంలో రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బాపూజీ సేవా సంఘం సభ్యులు



వేపాడ: వేపాడ అంగన్‌వాడీ కేంద్రంలో రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళలర్పిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది, చిన్నారులు



శృంగవరపుకోట: బ్యాడ్మింటన్ కోచ్ శ్రీరాములును సన్మానిస్తున్న క్రీడాకారులు, తల్లిదండ్రులు

అంగన్‌వాడీ కేంద్రాల్లో..

వేపాడ:మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్లు 1,2,3లలో శుక్రవారం గురుపూజోత్సవం నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటాలకు చిన్నారులతో అంగన్‌వాడీ కార్యకర్తలు మంగలక్ష్మి, దేవి రాజ్యలక్ష్మిపూలమాలలు వేయించి, నివాళులర్పించారు.

టైమ్ మేనేజ్మెంట్ కీలకం

- సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ జి.ఎస్.ఎన్.రాజు



కమాండర్ ఆఫీసర్ దంపతులను సత్కరిస్తున్న వీసీ రాజు, తదితరులు

కొత్తవలస: సమయం అత్యంత విలువైనదని, ఆ సమయాన్ని ఎవరైతే సద్వినియో గించుకుంటారో వారే ఉన్నత స్థితిలో స్థిరపడతారని సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.ఎస్.ఎన్.రాజు అన్నారు. తుమ్మికాపల్లి సమీపంలోని ఎస్.ఎస్.ఆర్.కల్యాణ మండపంలో వాగ్దేవి విద్యాసంస్థల ఫ్రెషర్స్ డే, ఉపాధ్యాయ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అతిథిగా హాజరైన వీసీ జి.ఎస్. ఎన్.రాజు, అధ్యాపకులు ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ టైమ్ మేనేజ్మెంట్ కీలకమన్నారు.ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రతీ ఒక్కరు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, మంచి అలవాట్లు అలవరచుకోవాలని విద్యార్థులకు సూచించారు. రక్షణ రంగంలో ఉద్యోగాలు సాధించేందుకు ఎలా సిద్ధం కావాలో కమాండర్ ఆఫీసర్ గోపేంద్ర, ప్రొఫెసర్ కవితా బండారి వివరించారు.ఇంగ్లిష్‌పై పట్టు సాధించాలని, రోజూ ఆంగ్ల పత్రికలు చదవడం అలవాటు చేసుకోవాలని వారు చెప్పారు.కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కోట్ని మహేశ్వరరావు,డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్,ఆంధ్రాయూనివర్శిటీ స్పోర్ట్స్ అథారిటీ మెంబర్ నాగరాజు,తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలసను ముంచెత్తిన వాన



కొత్తవలస రైల్వేస్టేషన్ వద్ద ప్రవహిస్తున్న వరదనీరు

కొత్తవలస: మండలంలో శుక్రవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. కొత్తవలస జంక్షన్‌తో పాటు రైల్వేస్టేషన్‌ను వరదనీరు ముంచెత్తింది. రైల్వే స్టేషన్‌కు ప్రయాణికులు రాకపోకలు నిలి,ఇపోయాయి.అలాగే విశాఖ–అరకు జాతీయ రహదారిపై వరదనీరు నదిని తలపించే విధంగా ప్రవహించడంతో వాహనాల రాకపోకలు కాసేపు స్తంభించి పోయాయి.సుమారు 2: 30 గంటల తర్వాత వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో వాహనాల రాకపోకలు సాగాయి.



అరకు- విశాఖ జాతీయ రహదారిలో పారుతున్న వరదనీరు

పార్టీ బలోపేతానికి కృషి చేయండి



వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ సభ్యులకు నియామకపత్రం అందజేస్తున్న రమణ

బొండపల్లి: గ్రామ స్థాయిలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి నూతనంగా నియమితులైన పార్టీ విభాగాల అధ్యక్షులు కృషి చేయాలని ఆ పార్టీ మండల బూత్ ఇన్‌చార్జ్ మహంతి రమణ సూచించారు. మండలంలోని కొండకిండాం గ్రామంలో వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల అధ్యక్షులుగా నియమితులైన వారికి శుక్రవారం ఆయన నియామక పత్రాలు అందజేశారు. గ్రామ పార్టీ అధ్యక్షుడిగా సీనియర్ నాయకుడు పెద్ద మజ్జి గోపిని నియమించామని, అంతా సమన్వయంతో పార్టీ బలోపేతానికి కృషిచేయాలని చెప్పారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు, వేండ్రం సర్పంచ్ కర్రోతు శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై శిక్షణ



మాట్లాడుతున్న సబల సంస్థ వైస్ ప్రెసిడెంట్ జోగినాయుడు

కొత్తవలస: చిరుధాన్యాల సాగుపై సబల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆత్మ సహకారంతో దేశపాత్రునిపాలెం గ్రామంలో చిరుధాన్యాల చెల్లెళ్లకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు.రీసోర్స్ పర్సన్, సబల సంస్థ వైస్ ప్రెసిడెంట్ జోగినాయుడు మాట్లాడుతూ చిరుధాన్యాల ప్రాధాన్యతను వివరించారు.ఇక్కడి వాతావరణ పరిస్థితులను తట్టుకోగలిగేవి, భవిషత్‌లో ఆహారాన్ని ఇచ్చే పంటలు చిరుధాన్యాలు మాత్రమేనని తెలిపారు. ఆహార భద్రత, ఆరోగ్య భద్రత,పశుగ్రాస భద్రత,పర్యావరణ, ఆర్థిక భద్రత కోసం చిరుధాన్యాలు సాగు చేసేందుకు ముందుకు రావాలని సబల సంస్థ కార్యదర్శి సరస్వతి రైతులకు పిలుపునిచ్చారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఈద్ మిలాద్ ఉన్ నబీ వేడుకలు

శృంగవరపుకోట: మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా పట్టణంలో ముస్లింలు శుక్రవారం మిలాద్ ఉన్ నబీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక జామియా మసీదు నుంచి వన్‌వే జంక్షన్, దేవీ జంక్షన్‌ల మీదుగా ఆర్టీసీ కాంప్లెక్ వరకు ముస్లింలు మహ్మద్‌ప్రవక్త సూక్తులు వల్లిస్తూ ర్యాలీ చేశారు. మిలాద్ ఉన్‌నబీ శుభాకాంక్షలు తెలుపుతూ గురువు మౌజిల్, ఇమామ్ అఫీఖ్ అహ్మద్, మౌజామ్ సబీర్, కమిటీ సభ్యులు షేక్ వజీర్, షేక్ రహ్మన్, తదితర మత పెద్దలు, యువకులు అంతా హాజరయ్యారు.



ఎస్.కోటలో ర్యాలీ చేస్తున్న ముస్లింలు

తప్పుడు నివేదికలు పంపించడం తగదు



బొడ్డవరలో ఆందోళన చేస్తున్న నిర్వాసితులు

శృంగవరపుకోట:

జిందాల్ నిర్వాసితుల ఆందోళన కొనసాగుతోంది. బొడ్డవరలో నిర్వాసితులు శుక్రవారం నిరసన తెలిపారు. గ్రామసభలో 200పైగా నిర్వాసితులు వచ్చి ఫిర్యాదులు చేస్తే 15మంది మాత్రమే భూములు ఇవ్వాలని అడిగారంటూ రెవెన్యూ అధికారులు తప్పుడు నివేదికలు ఇవ్వడం తగదని వారు అన్నారు.

జెడ్పీ ఛైర్మన్ పుట్టిన రోజు వేడుకలు

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పుట్టినరోజు వేడుకలను గజపతినగరం, చీపురుపల్లి, ఎస్.కోట నియోజకవర్గాల పార్టీ శ్రేణులు, అభిమానులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కేక్‌లు కట్‌చేసి ఆలయాల్లో పూజలు జరిపారు. వృద్ధులు, విద్యార్థులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. రక్తదాన శిబిరాలు నిర్వహించారు. అన్నదానం చేశారు. కార్యక్రమాల్లో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

– సాక్షినెట్‌వర్క్



చీపురుపల్లి: చీపురుపల్లిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు



కొత్తవలస: చైతన్య బధిరుల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న నెక్కల నాయుడుబాబు,శివ



గుర్ల: కేక్ కట్ చేస్తున్న సూర్యనారాయణరాజు, నాయకులు



మెరకముడిదాం: కేక్ కట్‌చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు



మెరకముడిదాం: సోమలింగాపురంలో రక్తదానం చేస్తున్న యువకులు



చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడిలో నిర్వహించిన వేడుకల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు



కొత్తవలస: న్యూహోప్ అనాథ ఆశ్రమ పాఠశాలలో అన్నదానం చేస్తున్న ఎంపీపీ గోపెమ్మ, జెడ్పీటీసీలు శ్రీదేవి, శివ

ప్రయాణ అవస్థలు!

- అరకొరగా బస్సు సర్వీసులు
- కళాశాలకు వెళ్లేందుకు విద్యార్థుల అవస్థలు
- తప్పనిసరి పరిస్థితుల్లో ఫుట్‌బోర్డుపై ప్రమాదకరంగా ప్రయాణం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

పూసపాటిరేగ: విద్యార్థులకు ప్రయాణ అవస్థలు తప్పడం లేదు. ఆర్టీసీ బస్సు సర్వీసులు తక్కువగా ఉండడంతో కిక్కిరిసి ప్రయాణం చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఉదయం కళాశాలకు వెళ్లేటప్పుడు..సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చేటప్పుడు బస్సు ఫుట్‌బోర్డుపై ప్రమాదకరంగా ప్రయాణించాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిల్లలకు ఏమైనా(ప్రమాదం) అయితే గానీ స్పందించరా అని అటు అధికార యంత్రాంగాన్ని, ఇటు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. తక్షణమే బస్సుల సంఖ్య పెంచాలని, అవసరమైతే విద్యార్థుల కోసం కొన్ని ప్రత్యేక బస్సులు నడపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ..

సాధారణ ప్రయాణికులతో పాటు విద్యార్థుల రాకపోకలు ఎక్కువగా ఉండే ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సు నిలుపుదల చేసే ప్రాంతాలు అత్యంత రద్దీగా కనిపిస్తాయి. ఈ నేపథ్యంలో ఆయా సమయాల్లో వీలైనన్ని ఎక్కువ బస్సులు నడపాలని, అలా అయితే విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు ఉండవు. ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 10 గంటలు, సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు పూసపాటిరేగ కూడలి నుంచి రణస్థలం, చింతపల్లి, తిప్పలవలస, భోగాపురం వైపు వెళ్లే బస్సుల్లో ప్రయాణించాలంటే నరకయాతన పడాల్సి వస్తోంది. ఇదిలా ఉంటే బస్సుల కొరత కారణంగా గంటల కొద్దీ బస్సుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి. ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉందని ఒక బస్సును వదిలేస్తే తర్వాతి బస్సు కోసం గంట కాలం వరకు వేచి చూడాలి. ఈ క్రమంలో కళాశాలకు సమయం అయిపోతోందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సరిపడా బస్సులేవీ?

పూసపాటిరేగలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో 5 వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరితో పాటు పనులకు వెళ్లే వారు, క్యాంపులు వెళ్లే వారు, పరిశ్రమల్లో పనిచేసే వారు ఇలా నిత్యం గ్రామాల నుంచి ఇక్కడికి బస్సుల్లో రావాలి. వారందరికీ సరిపడా బస్సులు లేకపోవడంతో వారు కూడా ఇబ్బందులు పడుతున్నారు. బస్సు దొరికితే.. సీటు దొరకదు.. సీటు దొరికితే గాలి ఆడదు అనే రీతిలో వ్యవహారం తయారైందని అందరూ అభిప్రాయపడుతున్నారు.



పూసపాటిరేగలో బస్సు ఎక్కేందుకు ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

రోజూ నిల్చొని ప్రయాణిస్తున్నా..

ప్రతిరోజూ పూసపాటిరేగలోని కళాశాలకు బస్సులో వస్తున్నా. ప్రతిసారి బస్సులో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటోంది. దీంతో సీటు దొరక్క రోజూ బస్సులో నిల్చొని ప్రయాణిస్తున్నా. ఒక్కోసారి కొంతమంది ఫుట్‌బోర్డుపై వేలాడుతూ ప్రయాణిస్తున్నారు. లేదంటే సమయానికి కళాశాలకు వెళ్లలేం. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సు సర్వీసులు ఎక్కువగా ఉండేలా చూడాలి.

– కె.హర్ష, విద్యార్థి, భీమవరం